క్లుప్తంగా

నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు


మద్దిలేటిస్వామి

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివారులో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామికి శ్రావణ శనివారం సందర్భంగా భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచేఆలయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ, ఆకుపూజ జరిపించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు ఏర్పాట్లను సమీక్షించారు.

నేత్రదానం


నేత్రాలు దానం చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని బోయపేట కాలనీకి చెందిన ఉరవకొండ నాయుడు (65) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. లైఫ్ యువనేత్ర సభ్యులు మృతుడి కుటుంబ సభ్యులకు నేత్ర దానంపై అవగాహన కల్పించారు. వారు రెడ్ క్రాస్ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో టెక్నీషియన్ ప్రదీప్ మృతుడి నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా తీసుకున్నారు. లైఫ్ యువనేత్ర సభ్యులు రంగారెడ్డి, పవన్, షేక్షావలి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ ఈఓలు

కోవెలకుంట్ల: పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ స్కూల్ క్రీడామైదానంలో శనివారం జిల్లాస్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను డోన్, నంద్యాల డిప్యూటీ ఈఓలు వెంకట్రామిరెడ్డి, శంకరప్రసాద్ ప్రారంభించారు. జిల్లాలోని ఆయా మండలాలకు చెదిన 200 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు అవసరమన్నారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి, పోటీల జిల్లా ఎంపిక ప్రక్రియ అబ్జర్వర్ నాగరాజు, జిల్లా సెక్రటరీ పరమేశ్వరరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం గీతా, సుపీరియర్ సిస్టర్ బాల తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


క్రీడా పోటీలకు హాజరైన ప్రముఖులు

బేతంచెర్ల: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలని అనంతపురం సమితి అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, పారిశ్రామికవేత్తలు మారుతీ కృష్ణ, గౌరి హుసేన్‌రెడ్డి, గుండా గోపాలు అన్నారు. శనివారం స్థానిక సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి కర్నూలు జిల్లాస్థాయి ఆటల పోటీలను పాఠశాల ఇన్‌చార్జ్ శ్యాంబాబు ఆధ్వర్యంలో ప్రారంభించారు. స్టేట్ బ్యాంక్ మేనేజర్ రవితేజ, పాఠశాల కార్యదర్శి సముద్రాల మద్దిలేటి స్వామి క్రీడా జ్యోతి వెలిగించారు. మొత్తం 18 మండలాల విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు.

విజయవంతం చేయండి

బేతంచెర్ల: ఈనెల 28వ తేదీన నంద్యాలకు వస్తున్న ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగమోహన్ రెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని బేతంచెర్ల మండల, పట్టణ బీజేపీ అధ్యక్షులు గుండా అశ్వర్థ నారాయణ, ఆంజనేయులు ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దద్దణాల ప్రాజెక్టు అభివృద్ధికి ప్రతిపాదనలు

బనగానపల్లె: మండలంలోని మీడియం ఇరిగేషన్ 1,513 ఎకరాల ఆయకట్టు కలిగిన దద్దణాల ప్రాజెక్టు అభివృద్ధికి రూ.6 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు మండల మైనర్ ఇరిగేషన్ ఇన్‌చార్జ్ ఏఈ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. రెండు క్రస్ట్ గేట్లు, పంట కాల్వల అభివృద్ధి పనులకు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరుకాగానే నిర్మాణ పనులు చేపడుతామన్నారు. ఇంకా మండలంలోని చెరువుపల్లె యనకండ్ల పసుపల జ్వాలాపురం చెరువుల అభివృద్ధికి ఒక్కొక్కటి ఆయా చెరువుల అభివృద్ధిని బట్టి రూ.70లక్షల నుంచి రూ.కోటి వరకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు.

వసతిగృహాల్లో సమస్యల దరువు!

- వేధిస్తున్న మౌలిక సదుపాయాల కొరత
- మంచాలు సరఫరా చేసినా నిరుపయోగం, కటిక నేలపైనే నిద్ర
- అద్దె భవనాల్లో హాస్టళ్ల నిర్వహణ
- మంచినీటి వసతి అంతంత మాత్రమే
- ప్రహరీలు లేక రాత్రి వేళల్లో సంచరిస్తున్న విష పురుగులు


అధ్వానంగా గుళ్లదుర్తి హాస్టల్‌కు వెళ్లే రహదారి


సంజామలలో నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు

కోవెలకుంట్ల: సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలు ఏకరువు పెడుతున్నాయి. విద్యార్థులకు సరైన మౌలిక వసతులు లేక సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. హాస్టళ్లలో ఎన్‌సీపీసీఆర్ ఆదేశాలను అమలు చేయడం లేదు. ఆరోగ్యకరమైన ఆహారం, తాగునీరు, మౌలిక సదుపాయల కొరత విద్యార్థులను వేధిస్తోంది. హాస్టళ్లలో అధ్వాన్న పరిస్థితులపై ఆంధ్రప్రదేశ్ ఇటీవల హైకోర్టు సీరియస్ అయ్యింది. సంక్షేమ హాస్టళ్లలో వసతులపై తీవ్ర అసంతృప్తి వ్యక్త చేసింది. బనగానపల్లె నియోజకవర్గంలోని పలు హాస్టళ్లలో వసతులపై సాక్షి బృందం విజిట్ నిర్వహించింది. ఇందులో ఆయా హాస్టళ్లలో నెలకొన్న పలు సమస్యలు బహిర్గతమయ్యాయి.

నేలపైనే విద్యార్థుల నిద్ర

బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో నాలుగు ఎస్సీ, ఏడు బీసీ బాలుర, బాలికల వసతిగృహాలు, నాలుగు కళాశాల హాస్టళ్లు ఉన్నాయి. కొన్ని వసతిగృహాల్లో విద్యార్థులు రాత్రి వేళల్లో నేలపై నిద్రిస్తున్నారు. కొన్ని హాస్టళ్లకు మంచాలు సరఫరా చేసినా అవి నిరుపయోగంగా మారి మూలన పడ్డాయి. ఆయా హాస్టళ్లలో ఈ ఏడాది ఇప్పటి వరకు దుప్పట్లు సరఫరా చేయకపోవడంతో ఇళ్ల వద్ద నుంచి దుప్పట్లు, బొంతలు తెచ్చుకుని వినియోగించుకుంటున్నారు. కిటీలకు జాలర్లు అమర్చినా దోమల బెడద అధికంగా ఉండటంతో రాత్రి వేళ్లలో దోమలతో అవస్థలు పడుతున్నారు. కొన్ని వసతి గృహాలకు ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళల్లో పాములు, తేళ్లు, తదితర విష సర్పాలతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటు కాలం వెల్లదీస్తున్నారు.

అద్దెభవనంలో హాస్టల్

కోవెలకుంట్ల పట్టణంలోని ఒక బీసీ బాలుర, ఒక ఎస్సీ బాలికల, రెండు కళాశాలల హాస్టళ్లు, మండలంలోని గుళ్లదూర్తిలో బీసీ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి బీసీ బాలుర వసతిగృహాలను సాక్షి విజిట్ చేసింది. పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహానికి సొంత భవనం లేకపోవడంతో దాదాపు పదేళ్ల నుంచి అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. హాస్టల్‌లో 80 మంది విద్యార్థులు ఉంటూ వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. అద్దె భవనం కావడంతో విద్యార్థులు నిద్రించేందుకు మంచాలు సరఫరా చేయకపోవడంతో నేలపై పడుకుని నిద్రిస్తున్నారు. హాస్టల్‌కు వెళ్లే దారి లోతట్టు ప్రాంతం కావడంతో చిన్నపాటి వర్షానికే నీరు నిల్వ చేరి రాకపోకలు సాగించేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

కూలేందుకు సిద్ధం

ఎస్సీ బాలికల వసతిగృహ భవనం శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ విద్యా సంవత్సరంలో హాస్టల్‌ను ప్రైవేట్ భవనంలోకి తరలించాల్సి ఉండగా ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. మండలంలోని గుళ్లదూర్తి బీసీ బాలుర వసతి గృహంలో 85 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులు రాత్రి వేళల్లో నిద్రించేందుకు మంచాలు సరఫరా చేసినా అవి నిరుపయోగంగా మారాయి. ఆ మంచాలపై విద్యార్థులు ట్రంకుపెట్టెలు, బ్యాగులు, బకెట్లు, ఇతర వస్తువులు పెట్టుకునేందుకు వినియోగించుకుంటున్నారు. తాగేందుకు మంచినీటి పథకం లేకపోవడంతో నీటిని స్టీల్ క్యాన్(కడాయి) ఏర్పాటు చేశారు. విద్యార్థులకు గ్లాసులు ఇవ్వకపోవడంతో టిఫిన్, భోజనం చేసిన తర్వాత పేట్లతో నీటిని పట్టుకుని తాగుతున్నారు. గ్రామ శివారులో హాస్టల్ భవనం ఉండటంతో వర్షాకాలంతో రహదారి బురదమయం కావడంతో విద్యార్థులు హాస్టల్ నుంచి పాఠశాలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. రెండు కళాశాల హాస్టళ్లకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు.

విద్యార్థులకు భద్రత కరువు

మండల కేంద్రం సంజామలలో బీసీ బాలుర వసతి గృహం ఉండగా 85 మంది విద్యార్థులు ఉంటున్నారు. ప్రభుత్వ హాస్టల్ భవనం అయినప్పటికీ ప్రత్యేకించి డైనింగ్ హాలు లేకపోవడంతో వరండాలోనే భోజనాలు చేస్తున్నారు. కిటికీలకు జాలర్లు అమర్చినా వర్షాకాలం కావడంతో దోమలు బెడద అధికంగా ఉండటంతో రాత్రి వేళల్లో నిద్రించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహానికి ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు భద్రత కరువైంది. రాత్రి వేళల్లో పాములు, తేళ్లు, తదితర విష సర్పాలు సంచరిస్తుండటంతో విద్యార్థులు రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. హాస్టళ్లు తెరచి నెల రోజులు దాటినా ఇప్పటి వరకు దుప్పట్లు పంపిణీ చేయకపోవడంతో విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచి తెచ్చుకున్న దుప్పట్లు, బొంతలతో కాలం గడుపుతున్నారు. తాగేందుకు మంచినీటి పథకం లేకపోవడంతో బోరునీటితోనే సరిపెట్టుకుంటున్నారు. వసతి గృహానికి రెగ్యులర్ వార్డెన్ లేకపోవడంతో బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేట వార్డన్ మునిరాజు ఇన్‌చార్జ్ వార్డన్‌గా కొనసాగుతున్నారు. నలుగురు సిబ్బంది ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు. విద్యార్థులు రాత్రి వేళల్లో నిద్రించేందుకు మంచాలు సరఫరా చేసినా తగినన్ని గదులు లేక వాటిని మూలన పడేసి నేలపైనే నిద్రిస్తున్నారు.


గ్లాసులు ఇవ్వకపోవడంతో ప్లేట్లతోనే నీటిని తాగుతున్న విద్యార్థులు



కోవెలకుంట్ల మండలం గుళ్లదూర్తి హాస్టల్‌లో ఉప్మా తినలేక పారవేస్తున్న విద్యార్థి

మంచాలు లేక..

అవుకు బీసీ బాలుర వసతి గృహంలో 80 మంది విద్యార్థులు ఉన్నారు.హాస్టల్‌లో మంచాలు లేకపోవడంతో నేలపై నిద్రిస్తున్నారు. హాస్టల్‌కు ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళల్లో విష సర్పాలు సంచరిస్తున్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు స్థానికులే కావడంతో రాత్రి భోజనం చేసిన తర్వాత ఇళ్లకు వెళ్లి నిద్రిస్తున్నారు. హాస్టల్ వార్డెన్‌తోపాటు ఇద్దరు సిబ్బంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు.

పాత దుప్పట్లు, పెట్టెలతోనే సరి..

బనగానపల్లె పట్టణంలో నాలుగు ఎస్సీ, బీసీ బాలుర, బాలికల వసతి గృహాలున్నాయి. రెండు కళాశాలల హాస్టళ్లు, మండలంలోని నందివర్గంలో ఎస్సీ బాలుర, ఇల్లూరు కొత్తపేటలో బీసీ బాలుర వసతిగృహాలున్నాయి. పట్టణంలోని ఎస్సీ వసతి గృహాన్ని సాక్షి విజిట్ చేసింది. 119 మంది బాలుర విద్యార్థులకు గాను 115 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టళ్లు తెరచి నెల రోజులు దాటినా ఇప్పటి వరకు విద్యార్థులకు కొత్త దుప్పట్లు, పెట్టెలు సరఫరా చేయలేదు. పాతవాటినే పంపిణీ చేసి నెట్టుకొస్తున్నారు. విద్యార్థులు మంచాలు లేకపోవడంతో నేలపైనే నిద్రిస్తున్నారు. విద్యార్థులు చదువుకునేందుకు రీడింగ్ హాలు లేదు. విద్యార్థులకు సరిపడ్డ డైనింగ్ హాలు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.


బేతంచెర్ల: బీసీ రెసిడెన్షియల్ స్కూలు, కళాశాల,


ప్యాపిలిలో బీసీ బాలుర వసతి గృహంలో నిరుపయోగంగా మరుగుదొడ్లు


ఇరుకు గదిలో నేలపై పడుకున్న విద్యార్థులు

సంక్షోభ హాస్టళ్లు

- సమస్యలతో విద్యార్థుల సావాసం
- బాత్‌రూంలు, మరుగుదొడ్లు కూడా లేని వైనం
- కాలకృత్యాలకు ఆరుబయటకు వెళ్తున్న అభ్యాసకులు

డోన్ టౌన్ : నియోజకవర్గ కేంద్రమైన డోన్ పట్టణంలో ఒక ఎస్సీ బాలుర, బాలికల, బీసీ బాలికల,బాలుర సంక్షేమ గృహాలతో పాటు జూనియర్, డిగ్రీ ఖళాశాలల విద్యార్థులకు స్టూడెంట్ మేనేజ్‌మెంట్ వసతి గృహాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. వసతి గృహాల్లో గదుల సంఖ్య విద్యార్థులకు ఏమాత్రం సరిపడక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతున్నా సౌకర్యాలు ఏమాత్రం మెరుగుపడటం లేదు. విద్యార్థులకు మంచాలు లేక పోవడంతో నేలపైనే పడుకుంటున్నారు. బీసీ బాలికల హాస్టల్‌లో నీటి వసతి,గదుల సమస్య తీవ్రంగా ఉంది. మేనేజ్‌మెంట్ వసతి గృహాలను అద్దె గృహాల్లో నిర్వహిస్తుండటంతో విద్యార్థులకు అణుగుణంగా బాత్ రూంలు లేక అవస్థలు తప్పడం లేదు. దీంతో ఆరు బయటే స్నానాలు ఆచరిస్తున్నారు. ఎస్సీ బాలుర వసతి గృహంలో 119 మంది, బీసీ బాలుర వసతి గృహంలో 123 ఉండగా బాలికల బీసీ హాస్టల్లో 180 మంది,ఎస్సీ హాస్టల్‌లో 156 విద్యార్థినులు ఉన్నారు. భవనాలు పాతబడి శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు భయం గుప్పిట్లో కాలం వెల్లదీస్తున్నారు.


ప్రహరీ లేని ప్యాపిలి బీసీ బాలుర వసతి గృహం,

ప్యాపిలిలో..

ప్యాపిలి: వసతి గృహాల పేరులో వసతి లోపించింది. కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో మొత్తం వంద మంది విద్యార్థులు ఉంటున్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులకు నీటి సౌకర్యం కల్పించకపోవడంతో విద్యార్థులు కాలకృత్యాలకు పొలం గట్లపైకి వెళ్తున్నారు. అలాగే వసతి గృహానికి ప్రహరీ లేకపోవడంతో సమీపంలోని పొలాల నుంచి విష పురుగులు వస్తున్నాయి. మరమ్మతులు చేయకపోవడంతో గదులు నిరుపయోగంగా ఉన్నాయి. చదువుకునేందుకు అవసరమైన గదులు లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.


డోన్‌లో ఆరుబయట స్నానం చేస్తున్న దృశ్యం

బేతంచెర్లలో..

బేతంచెర్ల: మండలంలో 2021లో బీసీ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల ప్రారంభమైనప్పటికీ సొంత భవనం లేకపోవడంతో పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో కొనసాగింది. 2024లో గోరుమానుకొండ గ్రామ సమీపాన రూ.36 కోట్లతో నిర్మించిన స్కూలు, కళాశాల పనులు పూర్తి కావడంతో అక్కడకి తరలించారు. ప్రస్తుతం వాటిల్లో 680 మంది విద్యార్థులున్నారు. త్రిఫేస్ విద్యుత్ లైన్ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పుడుతున్నారు. ఒక్కోసారి అధికలోడు కారణంగా ఫీజులు పోయినా, రాత్రి వేళ అంతరాయం ఏర్పడితే ఉదయం వరకు అంధాకారంలో మగ్గాల్సిందే. దీనికి తోడు హాస్టల్ బ్లాక్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో విద్యార్థులు తరగతి గదులు, ల్యాబ్‌లో పడుకుంటున్నారు. ఇక ఫర్నిచర్ మంజూరు కాకపోవడంతో నేలపైనే చదువులు సాగుతున్నాయి.గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వచ్చే నీటి పైపులైన్ నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేస్తే నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది.


బేతంచెర్ల: నేలపైనే విద్యార్థుల చదువులు

ఆరు బయటకు వెళ్తున్నాం



వసతి గృహంలో మరుగుదొడ్లు ఉన్నా..నీటి సౌకర్యం లేక వీటిని వాడుకునేందుకు అవకాశం లేదు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు పొలం గట్ల పైకి, ముళ్ల పొదల మధ్యకు వెళ్తున్నాం. వర్షాకాలంలో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రహరీ లేకపోవడంతో విషపురుగుల భయం వెంటాడుతోంది. విద్యార్థులందరూ ఒకే గదిలో చదువుకోవడం, పడుకుంటున్నాం. – సుమంత్, 9వ తరగతి, ప్యాపిలి బీసీ బాలుర వసతి గృహం

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి

కోవెలకుంట్ల: ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శక్తిటీం ఆధ్వర్యంలో వివిధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. 112, పోక్సో యాక్ట్, సైబర్ నేరాలకు సంబంధించిన టోల్‌ఫ్రీ నంబర్ 1930 గురించి తెలియజేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులతో సోదరభావంతో మెలగాలన్నారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కి పాల్పడితే శిక్షార్హులవుతారన్నారు. ఇటీవల చోటు చేసుకుంటున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, శక్తిటీం ఏఎస్‌ఐ నాగరాజు, మహిళా కానిస్టేబుల్ శంకరమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మద్రికుంటలో రెండిళ్లల్లో చోరీ

బేతంచెర్ల: మండలంలోని మద్రికుంట గ్రామంలో రెండు ఇళ్ల తాళాలను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. గ్రామానికి చెందిన వీరాయపల్లె శివన్న ఊరికి వెళ్లడంతో భార్య నారాయణమ్మ అమె కుమార్తె పక్క ఇంట్లో పడుకున్నారు. శివన్న ఇంట్లో బీరువాలో ఉన్న రూ.40 వేలు, బంగారు కమ్మలు, వెండి పట్టీలు ఎత్తుకెళ్లారు. అలాగే.. అంగుదాడు పెద్దయ్య స్వామి వేరే గ్రామానికి వెళ్లగా అతని ఇంట్లోని పెట్టెలో రూ.50 వేల నగదు, బంగారు కమ్మలు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుక వెళ్లారు. అదే గ్రామానికి చెందిన చిన్న అయ్యన్న ఇంట్లో చోరీకి ప్రయత్నించారు. ఉదయం ఇళ్లకు తాళాలు పగులగొట్టి ఉండటంతో కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ఎస్‌ఐ రమేష్ బాబు గ్రామానికి వెళ్లి చోరీ జరిగిన ఇళ్లను శనివారం పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాబు మోసాలను ప్రజలకు వివరిద్దాం

అవుకు: సీఎం చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు చేసిన మోసాలను వివరించటానికి బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ పేరుతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు శనివారం ఆయన తెలిపారు. ఆదివారం అవుకు మండల పరిధిలోని మెట్టుపల్లె , కోనాపురం గ్రామాల్లో, 28వ తేదీ కోవెలకుంట్ల మండలం వెలగటూరు గ్రామంలో, 29వ తేదీ కొలిమిగుండ్ల మండలంలోని ఉమ్మాయిపల్లె, తండాల్లో, 30న సంజామల మండలం ఆకుమళ్ల గ్రామం, 31వ తేదీ అల్వకొండ గ్రామంలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆదివారం అవుకు మండలం మెట్టుపల్లె గ్రామంలో సాయంత్రం 4గంటలకు, కోనాపురం గ్రామంలో సాయంత్రం 5గంటలకు నిర్వహించే బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అన్ని అనుబంధ సంఘాల కన్వీనర్లు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రెగ్యులర్ వార్డెన్లను నియమించాలి

డోన్ టౌన్ : సంక్షేమ హాస్టళ్లకు రెగ్యూలర్ వార్డెన్లు లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందక ఇబ్బందులకు గురవుతున్నారని ఎస్‌ఎస్‌యూఐ జిల్లా నాయకుడు తెలుగు విజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఆర్డీఓ నరసింహులును కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్ల సమస్యలకు నిలయాలుగా మారాయన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

సంజామల: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయకుమార్ రెడ్డి తెలిపారు. సమావేశానికి సరైన కోరంతో సభ్యుల పాల్గొలేదు. సమావేశానికి కనీసం నలుగు సభ్యులు పాల్గొనాల్లి ఉండగా ఇద్దరు మాత్రమే హాజరుకావడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. త్వరలో మరో తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

డోన్ టౌన్ : తలసేమియా బాధితుల కోసం స్ఫూర్తి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు ఆలా మధు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త బస్టాండ్ సమీపంలోని ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉదయం 9 గంటల నుంచి రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 18 సంవత్సరాలు పైబడిన ఆరోగ్యవంతులు తరలి రావాలని, ఆసక్తి ఉన్న వారు 7989474725 నంబరులో సంప్రదించాలని కోరారు.

రేపు వెలగటూరులో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ'

కోవెలకుంట్ల: కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఈ నెల 28న మండలంలోని వెలగటూరులో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించనునట్లు గ్రామ సర్పంచ్ ఎల్వీ సుధాకర్‌రెడ్డి శనివారం బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు చేపట్టే కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల కన్వీనర్లు, సభ్యులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాపింగ్ ఏర్పాటు చేయాలి


స్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కోవెలకుంట్ల: నంద్యాల– యర్రగుంట్ల రైల్వే మార్గంలో ప్రతి రోజు నడుస్తున్న గుంటూరు– తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలుకు కోవెలకుంట్లలో శాశ్వత స్టాపింగ్ ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రైల్వేస్టేషన్‌ను చేరుకుని స్టేషన్ మేనేజర్ గురుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజా సంఘాల నాయకులు కరీంబాషా, సుధాకర్ మాట్లాడుతూ కోవెలకుంట్ల మండలంతో పాటు సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, గోస్పాడు, అవుకు, కొలిమిగుండ్ల మండలాలకు చెందిన ప్రజలు ప్రతి రోజు కోవెలకుంట్లకు చేరుకుని ఇక్కడి నుంచి తిరుపతి, గుంటూరు, తదితర ప్రాంతాలకు వెళుతున్నారన్నారు. ఇక్కడ పర్మనెంట్ స్టాపింగ్ లేకపోవడంతో ప్రతి రోజు రైల్వే అధికారుల అనుమతితో నిలుపుదల చేయాల్సి వస్తోందన్నారు. అలా కాకుండా ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పర్మనెంట్ స్టాపింగ్‌తోపాటు రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వడ్డె సుబ్బరాయుడు, రామచంద్రరాజు, వెంకటేష్, నరసింహ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధర పెంచకపోతే అంతు చూస్తాం

- తక్కువ ధరకు ఎలా అమ్ముతావ్?
- గెలాక్సీ సెంటర్‌పై చికెన్ సిండికేట్ మాఫియా దాడి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన దుకాణం నిర్వాహకులు


దౌర్జన్యంగా చికెన్ ధరల పట్టికను చెరిపేస్తున్న దృశ్యం

డోన్: ఎక్కడైనా ఫలానా వస్తువుల ధరలు తగ్గించాలని ప్రజా సంఘాలు, ప్రజలు ఆందోళన చేయడం చూస్తుంటాం. అయితే కూటమి ప్రభుత్వంలో ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. పట్టణంలో చికెన్ ధరల సిండికేట్ మాఫియా తక్కువ ధరకు చికెన్ అమ్మరాదంటూ స్థానిక గెలాక్సీ చికెన్ ఔట్‌లెట్‌పై దాడికి పాల్పడ్డారు. స్థానిక ఏ వన్ చికెన్ సెంటర్ యజమానులు మస్తాన్, గౌస్‌తో పాటు రంగనాయకులు, మరొ కొందరు చికెన్ కిలో రూ.200 విక్రయించకుండా రూ.180 కే ఎలా విక్రయిస్తారంటూ గెలాక్సీ చికెన్ సెంటర్ సిబ్బందిని దుర్భాషలాడుతూ దాడి చేశారని నిర్వాహకులు గడ్డం శివప్రసాద్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, అనుదీప్ రెడ్డి పట్టణ సీఐ ఇంతియాజ్ బాషాకు ఫిర్యాదు చేశారు. తమ సంస్థకు జిల్లా వ్యాప్తంగా ఎనిమిది ఔట్‌లెట్స్ ఉన్నాయని, సంస్థ నిర్ణయించిన ధరకు తాము విక్రయిస్తామని తెలిపారు. చికెన్ ధర తమ చేతుల్లో లేదని వారికి నచ్చజెప్పినా వినకుండా సిండికేట్ సభ్యులు తమ దుర్భాషలాడుతూ దాడి చేయడం విచారకరమన్నారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ వ్యాపారానికి రక్షణ కల్పిస్తామని పోలీసులు హామీ ఇచ్చారని వారు చెప్పారు.